కొడుకులా ఉంటా.. శభాష్ అనిపించుకుంటా



జనగామ: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ: 17వ వార్డులో పల్లాను సత్కరిస్తున్న యువత, పార్టీ శ్రేణులు

- సీఎం తనపై చూపించే ప్రేమను ఫైనలుగా మార్చుకుంటా..
- మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నమలకుండానే మింగేస్తుంది
- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి 'పల్లా'

జనగామ: కొడుకులా అందరి అభిమానాన్ని చాటుకుని, శభాష్ అని పించుకునే విధంగా ఇక్కడే నివాసముంటూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జనగామ పట్టణంలోని 15, 17, 25, 19, 24, 22 వార్డుల్లో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, బండ యాదగిరిరెడ్డి, బండ పద్మ, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, నిమ్మతి మహేందర్‌రెడ్డి, మసిఉర్ రెహమాన్, గజ్జెల నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఉడుగుల నర్సింహులు, బొట్ల శ్రీనివాస్, బిజ్జాల నవీన్ గుప్తా, ధర్మ సంతోష్‌రెడ్డి, ఉడుగులు కిష్టయ్య, వీరేందర్ రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, మాజిద్ తదితరుల ఆధ్వర్యంలో బోనాలు, కోలాటంతో పల్లాకు ఘన స్వాగతం పలికారు. ఆయా వార్డుల పరిధిలోని ముఖ్య కూడళ్లలో పల్లా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తనపై చూపించే ప్రేమను ఫైనలుగా మార్చుకుని ఈ ప్రాంత అభివృద్ధి కోసం సాధ్యమైనంత వరకు ఎక్కువ నిధులను తీసుకు వస్తానని చెప్పారు. కేసీఆర్ దూతగా ఇక్కడికి వచ్చిన తాను.. జనగామను కనీ విని ఎరుగని స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. మాటలు కాదని.. అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే.. చేతల్లో చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జనగామ రూపురేఖలు మారిపోయాయని, ఇప్పుడు గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల తరహా ముందుకు వెళ్లేలా పక్కా ప్రణాళికను తయారు చేసుకున్నట్లు వివరించారు.

కాలర్ ఎగురవేసుకునేలా చేస్తా..

ఈ ప్రాంత ప్రజలు ఎక్కడికి వెళ్లినా జనగామ అని గౌరవంగా కాలర్ ఎగురవేసుకునే విధంగా పరిపాలన ఉండేలా నడుచుకుంటానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉండి, రోడ్డు, రైల్వే మార్గాలకు అనుసంధానంగా ఉన్న జనగామలో ఇండస్ట్రియల్‌గా అభివృద్ధి సాధించి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, పాల ఉత్పత్తులు తదితర యూనిట్లు ఇక్కడికి వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ వస్తే నమలకుండానే మింగేస్తుంది..

అధికారం కోసం తహతహలాడుతున్న కాంగ్రెస్ వస్తే రాష్ట్ర సంపదను నమలకుండానే మింగేస్తుందని ఆరోపించారు. పదేళ్ల క్రితం పురుడుపోసుకున్న తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ నాయకత్వంలో దేశం గర్వించే స్థాయిలో ఎదిగిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాలతో పాటు రైతు బంధు, ఆసరా పింఛన్ల పెంపు, అర్హులైన ప్రతి ఒక్కరికీ బీమా, సౌభాగ్యలక్ష్మి, గృహలక్ష్మి తదితర పథకాలు అందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పల్లా అభ్యర్థించారు.

మళ్లీ రౌడీ రాజ్యం కావాలా..

తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్ల పాటు ప్రశాంతంగా ఉన్న జనగామలో మళ్లీ రౌడీ రాజ్యం కావాలా అని పల్లా ప్రశ్నించారు. వ్యాపారులు, అన్ని వర్గాల ప్రజలు ఎవరి పనులు వారు చేసుకునేలా తన పరిపాలన ఉంటుందన్నారు. కాంగ్రెస్ వస్తే రౌడీ రాజ్యం చూడాల్సి వస్తుందని చెప్పారు. తాను గెలుపొందగానే పట్టణంలోని బతుకమ్మ కుంట, రంగప్ప చెరువు సుందరీకరణ పనులు చేపడతానని తెలిపారు. జనగామ జిల్లా కేంద్రంలోని 30 వార్డులకు రోజువారీగా అందిస్తున్న తాగునీటిని మరింత శుద్ధి చేసి ప్రతి ఒక్కరూ తాగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటానని పేర్కొన్నారు. కాగా, కురుమ సంఘం రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు, 15వ వార్డు అధ్యక్షుడు ఆలేటి రాజు.. రాజేశ్వర్‌రెడ్డికి గొర్రెపిల్ల బహుమానంగా ఇచ్చి గొంగడితో సత్కరించారు. అంతకు ముందు ఆయా వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను ఆయన ప్రారంభించారు.

పల్లా సతీమణి ఇంటింటి ప్రచారం..

బచ్చన్నపేట: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సీఎం కేసీఆర్ అభివృద్ధి చేస్తున్నారని, అధికార పార్టీ నాయకుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి నీలిమ కోరారు. మండల కేంద్రంలోని పలు వార్డుల్లో ఆమె ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, సర్పంచ్‌లు శివరాత్రికవిత, మూసిని సునీత, ఖలీల్‌బేగమ్, మల్లారెడ్డి, స్వామి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లాను గెలిపించి అసెంబ్లీకి పంపాలి..

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపాలని ఆ పార్టీ నాయకుడు కొండి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పల్లాకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.



5వ వార్డులో పల్లాకు గొర్రెపిల్ల ఇచ్చి గొంగడితో సత్కరిస్తున్న రాజు



బచ్చన్నపేటలో ప్రచారం చేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ

ఆశీర్వదిస్తే ఐదేళ్లు సేవ చేస్తా..



గూడూరులో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు



తొర్రూరు డివిజన్ కేంద్రంలో వాకర్స్‌తో ఎర్రబెల్లి దయాకర్‌రావు

- కాంగ్రెస్‌వి వారంటీ లేని గ్యారంటీలు
- బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: ఆశీర్వదిస్తే మరో ఐదేళ్లు ప్రజాసేవ చేస్తామని బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. డివిజన్ కేంద్రంలో యతిరాజారావు పార్కులో ఆదివారం ఆయన వాకర్స్‌ను కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం వారితో సరదాగా వాలీబాల్ ఆడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కే ఓటు అడిగే హక్కు ఉందని తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించేందుకు సిద్ధమైందన్నారు. కాంగ్రెస్ పార్టీవి వారంటీ లేని గ్యారంటీలు అని దుయ్యబట్టారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే మూడు గంటల కరెంట్, ఏడాదికో ముఖ్యమంత్రి మారడం గ్యారంటీ అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ సీఎం కేసీఆరే అన్నారు. నియోజకవర్గానికి డాలర్లతో గెస్ట్‌లు వస్తున్నారని, వారికి తగు రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నో అభివృద్ధి పనులు చేశా..

పాలకుర్తి: నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పనులు చేశానని ఇంకా చేయాల్సినవి ఉన్నాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలో శాతపురం, ఈరవెన్ను, బమ్మెర, గూడూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రితో పాటు ఆయన సతీమణి ఉషాదేవి పాల్గొని మాట్లాడారు. తాగు, వ్యవసాయానికి నీరు, 24 గంటలు విద్యుత్, రోడ్లు, పాఠశాలలకు నిధులు, వల్మిడి, బమ్మెర, పాలకుర్తిలో నిధులు మంజూరు చేసి కవులు, కళాకారుల నిలయాలుగా మార్చడం జరిగిందని అన్నారు. నిరుద్యోగులకు ఎర్రబెల్లి ట్రస్టు ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేయడంలో మన నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎర్రబెల్లి ఉషాదేవి

మరిన్ని సదుపాయాలు..

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుతో ప్రజలకు మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కల్పన జరుగుతుందని మంత్రి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నాగారం ఏరియాలో ఉన్న శివసాయి గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అయ్యప్ప క్వార్టర్స్ వారి బ్రోచర్స్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దయాకర్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానుల సమావేశం జరిగింది.



కొడకండ్ల: బీఆర్ఎస్‌లో చేరిన బెస్ట్‌ఫ్రెండ్స్ సభ్యులు

బీఆర్ఎస్‌లో చేరిక

కొడకండ్ల: మండల కేంద్రానికి చెందిన బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఆసీఫ్ ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సంస్థ నిర్వాహకులు అరుణ్‌గోపాల్, కొండ్రాతి నరేష్, చిలుసాని రవి, చెరుకు సంధ్యారాణి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు.

ఎర్రబెల్లి తరఫున ప్రచారం

పాలకుర్తి టౌన్: మంత్రి దయాకర్‌రావు తరఫున ఆదివారం మండల కేంద్రంలోని 51వ బూత్‌లో మాజీ సర్పంచ్ కమ్మగాని ఆంజనేయులు, నాయకులు నాగేశ్వర్, చక్కు పరమేశ్వర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కమ్మగాని సారయ్య, వెంకన్న, రాములు, మామిండ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి ఓటరు స్లిప్పులను బూత్ లెవల్ అధికారులు వెళ్లి పంపిణీ చేయాలని తహసీల్దార్ విశాలాక్షి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఓటరుకు స్లిప్పులను అందించాలని తెలిపారు. ఈ పంపిణీ రెండు రోజుల్లో పూర్తి కావాలన్నారు. ఎంఆర్ఐ, ఏఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు పాల్గొన్నారు.



ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్ఓలు

బీఆర్ఎస్, బీజేపీని ఓడించాలి

రఘునాథపల్లి: ప్రజలకు భారంగా మారిన బీఆర్ఎస్, బీజేపీని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి, పాతూరి సుగుణమ్మ, ఆది సాయన్న పాల్గొన్నారు.

బీసీ సీఎం కావాలంటే బీజేపీని గెలిపించండి



జనగామ: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దశమంతరెడ్డి



జనగామ పట్టణంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న దశమంతరెడ్డి

- ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే సమగ్రాభివృద్ధి
- ఇంటింటి ప్రచారంలో బీజేపీ జనగామ అభ్యర్థి దశమంతరెడ్డి

జనగామ: తెలంగాణలో బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావాలంటే భారతీయ జనతా పార్టీకి ఓటు వేయాలని ఆ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. ఆదివారం జనగామ పట్టణంలోని 18, 19 వార్డుల్లో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. దశమంతరెడ్డికి పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ చెప్పే మాటలు నమ్మి ఓటు వేస్తే మోసపోక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్‌తో భవిష్యత్ లేదని, ఆ పార్టీ చెప్పే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇక్కడ ఇస్తామంటున్న పథకాలను అక్కడ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మాదిరిగా బీజేపీ చెప్పదని, ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానం నెరవేర్చి తీరుతుందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు(బీజేపీ) ఉంటేనే తెలంగాణ ఊహించని స్థాయిలో అభివృద్ధిని చూస్తామన్నారు. ఉద్యమకారుల ఆకాంక్షతో ఏర్పడిన తెలంగాణను నెరవేర్చేలా బీజేపీ బీసీ బిడ్డను ముఖ్యమంత్రిగా ప్రకటించడం అధినాయకత్వానికి వారిపై ఉన్న ప్రేమ అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే క్వింటా ధాన్యానికి మద్దతు ధర రూ.3,100, పంట పరిహారం, నాణ్యమైన ఉచిత విద్య, రూ.10లక్షల వరకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం, అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కల సాకారం, తదితర పథకాలను వందశాతం అమలు చేస్తామని కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించిన మేనిఫెస్టోలో ప్రకటించారన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే, జనగామ సమగ్రాభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పాటు పడతామన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని దశమంతరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాగా కుమ్మర సంఘం నాయకులు మడికొండ వెంకటేష్, బాల నర్సయ్య, కప్పలగిరి ఎల్లయ్య, దేవేందర్, తదితరులతో సుమారు 200 మంది బీజేపీలో చేరగా, ఆయన కండువా కప్పి స్వాగతించారు. బేజాడి బీరప్ప, సద్ది సోమిరెడ్డి, రమేష్, పవన్ శర్మ, హరీష్, ఎల్లయ్య, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

కాషాయ జెండాకు పట్టం కట్టండి

బచ్చన్నపేట: సాధారణ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో బీజేపీ కాషాయ జెండాకు పట్టం కట్టాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. ఆదివారం మండలంలోని పోచన్నపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన నియోజకవర్గ అభ్యర్థి ఆరుట్ల దశమంత్‌రెడ్డికి ఓట్లు వేసి గెలించాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్త సమాచారం

బిల్డింగ్ కాంట్రాక్టర్ల భవనం ప్రారంభం



జనగామ: జనగామ పట్టణంలోని బీరప్పగడ్డ ఏరియాలో నూతనంగా నిర్మాణం చేసిన ది జనగామ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ భవనాన్ని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రాంభించారు. ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు బాల్దె మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన కార్యకక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భవనాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట ప్రకాష్, కోశాధికారి దోర్నాల రమేష్, గౌరవ అధ్యక్షుడు దోర్నాల శ్రీహరి, ఉపాధ్యక్షులు జట్ట నరసింహులు, జన్ని శ్రీను, తోట సత్యం, సహాయ కార్యదర్శులు బర్ల శ్రీశైలం, బేజాడి కేశవులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఏం చేశారో చెప్పాలి

జనగామ: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, రైతు బంధు రాష్ట్ర అధ్యక్షుడుగా ఉండి పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిరుద్యోగులు, రైతులకు ఏం చేశాడో జనగామ ప్రజలకు చెప్పాలని తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్లు లేక ఎందరో ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. పరీక్ష రాసిన అభ్యర్థులు పేపర్ లీకేజీలతో మానసికంగా, ఆర్థికంగా కుంగి పోతున్నారన్నారు. కనీసం నిరుద్యోగ భృతి సైతం ఇప్పించలేని పల్లాకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు.

సీపీఎంతోనే ప్రజా సమస్యలు పరిష్కారం

బచ్చన్నపేట: సీపీఎంతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మోకు కనకారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కేసిరెడ్డిపల్లి, భోనకొల్లూర్, లక్ష్మాపూర్, బండనాగారంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూర్జువా పార్టీలు స్వలాభం కోసం మాత్రమే పని చేస్తాయని ప్రజా సమస్యలను విస్మస్తాయని తెలిపారు. స్వలాభం చూసుకోని సీపీఎం పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ వెంకటేష్, పర్వతం నర్సింహులు, శ్రీనివాస్, బాబు, పార్వతమ్మ, అండాలు, రేవతి, మోహిణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

బచ్చన్నపేట: లింగంపల్లికి చెందిన ఆర్ముల్ల ఎలమ్మ మృతి చెందింది. కాగా, మృతురాలు ధరణి మహిళా సంఘంలో సభ్యురాలు కావడంతో అంత్యక్రియల కోసం రూ. 5వేల ఆర్థిక సాయాన్ని సంఘం సీఈఓ పన్నీరు సత్యం ఆదివారం అందజేశారు. కోఆర్డినేటర్ శ్రీనివాస్, లక్ష్మీనర్సవ్వ తదితరులు ఉన్నారు.

కృష్ణాజీగూడెంలో..

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం జీపీ సీనియర్ పారిశుద్ధ్య కార్మికుడు కిన్నెర సాయిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పుట్ట కిరన్‌రెడ్డి రూ. 3 వేలు బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయంగా అందజేశాడు.

విజయవంతం చేయండి

చిల్పూరు: నేటి సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని మండలంలో ఆదివారం గడపగడపకు బీఆర్ఎస్ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ, గ్రంథాల, చిల్పూరు ఆలయ చైర్మన్‌లు సంపత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీధర్‌రావు, ఎంపీపీ సరిత బాలరాజు, వైస్ ఎంపీపీ సరితనర్సింహ, సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, కంకటి రవీందర్, మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి, ఉమసమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దోచుకోవడం కాంగ్రెస్ విధానం



విలేకరులతో మాట్లాడుతున్న కడియం



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కడియం శ్రీహరి

- అసత్యపు ఆరోపణలతో మహిళలను తప్పుదోవ పట్టిస్తున్న ఇందిర
- బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అవినీతి, అక్రమాలు అధికమవుతాయని, దోచుకోవడం, దాచుకోవడం ఆ పార్టీ విధానాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. నేడు మండలంలోని ఛాగల్లు శివారు శివారెడ్డిపల్లిలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఆదివారం కడియం పరిశీలించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 1 గంటకు సీఎం కేసీఆర్ సభ ఉంటుందని, ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నామని, దాదాపు లక్షమందికి పైగా ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారన్నారు. తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించింది, రాజకీయ భిక్షపెట్టింది ఘన్‌పూర్ నియోజకవర్గమని, కారు గుర్తుకు ఓటువేసి మరోసారి ఆశీర్వదించి రానున్న రోజుల్లో మీకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని ఆయన కోరారు.

ఆరు గ్యారంటీలు ఏమోగాని..
ఆరుగురు సీఎంలు మారుతారు

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ స్కీంలతో ప్రజలను దగా చేసేందుకు మాయమాటలు చెబుతుందని, తప్పిదారి కాంగ్రెస్‌కు ఓటువేస్తే ఆరు గ్యారంటీలు ఏమోగాని ఐదేళ్లలో ఆరుగురు సీఎంలు మారుతారని కడియం ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేవని, దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందన్నారు. ఐదు గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావాలా, 24 గంటల కరెంటు అందించే బీఆర్ఎస్ కావాలా ప్రజలు తేల్చుకోవాలని, కాంగ్రెస్ మాయమాటలు నమ్మి దగా పడవద్దన్నారు.

మహిళలను తప్పుదోవ పట్టిస్తున్న ఇందిర

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇందిర తనపై అసత్యపు ప్రచారం చేస్తూ నియోజకవర్గ మహిళలను తప్పుదోవ పట్టిస్తుందని కడియం శ్రీహరి అన్నారు. మొదటి నుంచి మహిళలంటే తనకు అమితమైన గౌరవమని, ఆరుగురు అక్కాచెల్లెళ్లు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారన్నారు. తాను వ్యక్తిగత విమర్శలు చేశానని ఆర్‌ఓకు ఫిర్యాదు చేసిందని, అయితే ఎలాంటి సాక్ష్యాలు లేవన్నారు. కేవలం ఓటమి భయంతోనే అనవసర ఆరోపణలు చేస్తున్నారని, ఏమైనా మాట్లాడాలంటే నా అనుభవం, సభ్యత అడ్డువస్తుందన్నారు. ఇందిర నామినేషన్ సమయంలో అఫిడవిట్‌లో సమర్పించిన దాని ఆధారంగానే ఆమెపై చీటింగ్‌కేసు ఉన్నట్లు వ్యాఖ్యానించానని, ఎలాంటి వ్యక్తిగత ఆరోపణలు చేయలేదన్నారు. నా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు చేయలేదని, తనపై చిన్న పిటీ కేసు కూడా లేదన్నారు. చీటికి మాటికి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న ఇందిరపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని, సంబంధించిన సాక్ష్యాలు తన వద్ద ఉన్నాయని, అవసరమైతే లీగల్ నోటీసులు పంపిస్తానని చెప్పారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భువనగిరి ఆరోగ్యం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీహెచ్. నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, చేపూరి వినోద్, ఎంపీపీ కందుల రేఖ, బోనగిరి రవీందర్, పోగుల సారంగపాణి, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.



వడ్డెగూడెంలో మాట్లాడుతున్న కడియం దివ్య

బీఆర్ఎస్‌లో చేరిక

ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు అంబటి కిషన్‌రాజ్, అంబటి కార్తీక్‌రాజ్ 75 మందితో స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పొదల రాజేష్, బొమ్మగల్ల విక్రమ్, వినయ్, విజయ్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

శివునిపల్లికి చెందిన ప్రముఖ వైద్యుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మారెడుపాక ఉమాశంకర్ తల్లి మారెడుపాక సరోజన(59) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతిచెందగా విషయం తెలుసుకున్న కడియం శ్రీహరి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, పార్టీ నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, పార్శి కృష్ణారావు తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన డాక్టర్లతో కడియం శ్రీహరి

కడియం కుమార్తె ఇంటింటా ప్రచారం

జఫర్‌గఢ్: వడ్డెగూడెంలో కడియం శ్రీహరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కుమార్తె దివ్య ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బానోత్ రాజేష్‌నాయక్, కుల్లా మోహన్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాటికాయల వరుణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కడియం శ్రీహరిని గెలిపించాలని కోరుతూ ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, గుజ్జరి రాజులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

రఘునాథపల్లి మండలంలో..

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్, ఇబ్రహీంపూర్, అశ్వరావుపల్లిలో శ్రీహరి గెలుపునకు ఆ పార్టీ నాయకులు ఇంటింటా బొట్టు పెడుతూ కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ శాగ నాగరాజు, సర్పంచ్ దొరగొల్ల అయిలమ్మ, యాదగిరి, మధు, లక్ష్మయ్య, మహేందర్, వెంకన్న, ప్రేమ్, కుర్ర కమలాకర్ తదితరులు ఉన్నారు.

కడియం శ్రీహరికే మా మద్దతు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్ పార్టీకేనని, ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపు కోసం కృషి చేస్తామని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెజావత్ వాసునాయక్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అజ్మీరా పూల్‌సింగ్‌నాయక్, భూక్య స్వామి తదితరులు పాల్గొన్నారు.